క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు



అలంకరణలో వేంకటేశ్వరస్వామి

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాజేంద్రనగర్‌లో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి 23 సంవత్సరాలైన సందర్భంగా అర్చకులు, భక్తులు స్వామి వారి పాదాలను సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, కోశాధికారి సుధాకర్ గుప్త, జయంతి వెంకట్, సుదర్శన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ వెంకటరమణప్ప దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ఎంపీడీఓ వెంకటరమణప్ప పదవీ విరమణ నేపథ్యంలో గురువారం వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన సేవలను కొనియాడారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బీవీ మాధవి, జెడ్పీటీసీ కదిరప్ప, కోఆప్షన్ సభ్యుడు సిపాయిబాషా, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రావు, అధికారులు, సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీలు, ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆఫీస్ సబార్డినేట్‌కు ..



అటెండర్ ను సన్మానిస్తున్న అధికారులు

పెద్దవడుగూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా విధులు నిర్వహిస్తున్న రామ్‌గోపాల్‌రెడ్డిని గురువారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయనకు రికార్డ్ అసిస్టెంట్‌గా పదోన్నతిని కల్పిస్తూ నగరూరు జెడ్పీ పాఠశాలకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రి, సీనియర్ అసిస్టెంట్ శేషారెడ్డి, కేశవ, ఏపీఓ పుల్లారెడ్డి, సిబ్బంది, నాగరాజు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు..



హెచ్‌ఎం విజయమ్మను సన్మానిస్తున్న దృశ్యం

యాడికి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయమ్మను గురువారం పదవీ విరమణ సందర్భంగా సన్మానించారు. ఎంఈఓలు కాశెప్ప, ధనలక్ష్మితోపాటు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు హాజరై శాలువాలు, పూలమాలలు సత్కరించారు. కార్య క్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రనాయక్

గార్లదిన్నె: విద్యార్థులు చదువుతోపాటు సేవా భావం అలవర్చుకోవాలని ఎంఈఓ చంద్రనాయక్ సూచించారు. గురువారం మండలంలోని కనంపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి జేఎన్‌టీయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ శారద, ఎంఈఓ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎంఈఓ మాట్లా డుతూ ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల విద్యార్థులు వారం రోజుల నుంచి పాఠశాలలో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగజ్యోతి, ఉపాధ్యాయులు సర్దార్ వలి, డాక్టర్ ఎంఎల్ రవిచంద్ర, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ అరవింద్, చిన్న పుల్లయ్య, ఎస్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

జేసీ కంచుకోటకు బీటలు

- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి



చుక్కలూరువాసులను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: నియోజకవర్గంలో జేసీ కంచుకోటకు బీటలు వారుతున్నాయి. తాడిపత్రి మండలం చుక్కలూరు గ్రామంలో టీడీపీ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి తోపాటు 10 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. గురువారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చుక్కలూరు గ్రామానికి వెళ్లి, వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. దశాబ్దాల కాలంగా జేసీ కంచుకోటగా ఉన్న తాడిపత్రి మండలం చుక్కలూరులో వీరి చేరికతో వైఎస్సార్‌సీపీ బలం పుంజుకున్నట్లైంది. గత స్థానిక ఎన్నికల్లో చుక్కలూరు లో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలు వైఎస్సార్‌సీపీనే గెలుపొందింది. ఎస్సీ సామాజిక వర్గంలో బలంగా ఉన్న వైఎస్సార్ సీపీకి ఇప్పుడు టీడీపీ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆయన అనుచరుల చేరికతో గ్రామంలో మరింత బలం పుంజుకుని టీడీపీని కోలుకోలేని దెబ్బతీసినట్లైంది. తాడిపత్రి మండలంలో పార్టీ సరికొత్త బలం పుంజుకోవడానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఎమ్మెల్యే అయిన తర్వాత గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అమలు, గ్రామాన్ని ప్రశాంతంగా ఉంచడంతో తాము వైఎస్సార్‌సీపీలో చేరామని విష్ణుమోహన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, మహబూబ్, సుబహాన్, బాషా, పోలిమేర వినోద్‌కుమార్, బాలా సాహెబ్, చాకలి శివశంకర్ తదితరులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. మోసకారి చంద్రబాబును నమ్మొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో తాడిపత్రిలో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి, సీనియర్ నాయకులు వెంకటరెడ్డిపల్లి పుల్లారెడ్డి, ఆలూరురామేశ్వరరెడ్డి, కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి, పాపిరెడ్డి, శివారెడ్డి, హనుమంతరెడ్డి, నాగార్జునరెడ్డి, ధామోదర్‌రెడ్డి, విజయ్‌కాంత్ రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చంద్ర, విశ్వనాద్, శ్రీరంగ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



నిదనవాడలో ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు

శింగనమల: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని నిదనవాడ, రాచేపల్లి గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయన మాట్లాడుతూ పేదలకు మేలు జరగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలన్నారు. జగనన్న ఇచ్చిన మాట తప్పరని, గత ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను వంద శాతం అమలు చేశారన్నారు. గతంలో టీడీపీ నాయకుడు చంద్రబాబు 600 హామీలిచ్చి అమలు చేయకుండా ప్రజలు, మహిళలు, రైతులు, నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఈ ఎన్నికల్లోనూ తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్యామలమ్మ, ఎంపీటీసీ సునీతమ్మ, నాయకులు ఎస్‌పీ నారాయణరెడ్డి, చెన్నకేశవులు, అమర్‌నాథ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి, రామిరెడ్డి, అప్పిరెడ్డి, దైవాధీనం, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి



పెనకచెర్ల డ్యాంలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గార్లదిన్నె: ప్రజలు ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ మనీస సూచించారు. గురువారం మండలంలోని పెనకచెర్లడ్యాం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో ఎండ తీవ్రతపై ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లాల్సివస్తే టోపీ ధరించాలన్నారు. తలనొప్పి, తల తిరగడం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్ వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వడదెబ్బగా భావించి చల్లటి నీడ ప్రాంతంలోకి చేర్చాలన్నారు. తడి బట్టతో శరీరం ఉష్ణోగ్రత తగ్గేవరకు తుడవాలన్నారు. ప్రథమ చికిత్స అనంతరం సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శివయ్య, ఎంఎల్‌హెచ్‌పీ అరుణజ్యోతి, ఏఎన్‌ఎం భవాని, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు దేవదాయశాఖ అధికారుల సమక్షంలో స్వామి శాశ్వత హుండీలోని కానుకలను లెక్కిస్తున్నట్లు ఈఓ బాబు తెలిపారు.గురు వారం ఈఓ మాట్లాడుతూ మాఘమాసంలో భక్తులు స్వామి హుండీలో సమర్పించిన కానుకలు లెక్కింపులో పాల్గొనే వారు హిందూ సంప్రదాయ దుస్తులు ధరించి రావాల న్నారు. గ్రామపెద్దలు, భక్తులు హాజరు కావాలన్నారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

గార్లదిన్నె: వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్ఐ మహమ్మద్ గౌస్ సూచించారు.గురువారం మండల కేంద్రంలో ఎస్ఐ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా వాహనాలు ఆపి రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా లేని వారికి అపరాధరుసుం విధించారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసేవారు సీటు బెల్టు ధరించాలన్నారు. అలాగే మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. వాహనదారులు ట్రాఫిక్‌ని బంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు అరికట్టవచ్చన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ షాషావలి

గుత్తి/గుత్తిరూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం చిన్న జొన్నగిరి గ్రామానికి చెందిన షాషావలి బుధవారం తెల్లవారు జామున సుమారు నాలుగు గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వివరాలు.. చిన్న జొన్నగిరికి చెందిన షాషావలి ఇదే గ్రామానికి చెందిన షాకీరాను ప్రేమించాడు. గత ఏడాది పెళ్లి చేసుకున్నారు. అయితే షాషావలిని, ఆయన తల్లిని తరుచూ షాకీరా తల్లిదండ్రులు అవమాన పరిచేవారు. బుధవారం మరోసారి అవమానపరచడంతో మనస్తాపం చెంది షాషావలి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే 108లో గుత్తి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. ఘటనపై జొన్నగిరి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కల్లూరులో 3న రాతి దూలం లాగుడు పోటీలు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఆదివారం సింగరప్ప తిరునాల్లో భాగంగా న్యూ కేటగిరి ఎద్దులకు రాతిదూలం పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే వారు రూ.800 ప్రవేశరుసుం చెల్లించాలన్నారు. దాతల సహకారంతో మొదటి బహుమతి రూ. 50 వేలు నిర్వాహకులు తెలిపారు. అలాగే వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10వేలు, రూ.8 వేలు బహుమతులుంటాయన్నారు. వివరాలకు 9014399414, 9866149433 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పేర్ల మార్పును ఉపసంహరించుకోవాలి



జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

గుంతకల్లు: గుంతకల్లు డివిజన్‌ను బాలాజీ డివిజన్ పేరుగా మార్చాలని కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థిసేన నాయకులు డిమాండ్ చేశారు. గురువారం విద్యార్థి సేన అధ్యక్షుడు అబ్దుల్‌బాసిద్ నేతృత్వంలో పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గుంతకల్లు రైల్వే డివిజన్, జంక్షన్‌కు ఎంతో చరిత్ర ఉందని గుర్తు చేశారు. బ్రిటీష్ వారు ఉత్తర, దక్షిణ భారతదేశాలకు కూడలిగా గుంతకల్లులో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేశారన్నారు. పేర్లు మార్పును ఉపసంహరించుకుపోతే రాజకీయలకు అతీతంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. నిరసనకు ఆటోడ్రైవర్లు మద్దతుగా నిలిచారు. కార్యక్రమంలో విద్యార్థిసేన కార్యదర్శి మహేష్‌గుప్తా, నాయకులు జయసింహా, సాయి, వీరన్న, మహబూబ్, సుందర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లిలో మహిళ ఇంట్లో చోరీ

బుక్కరాయసముద్రం: మండలంలోని రెడ్డిపల్లిలో ఓ మహిళ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల వివరాలు మేరకు.. ఒంటరి మహిళ అయిన పెద్దక్క కూలి పనులు చేసుకుంటూ జీనవ గడుపుతుండేది. ఈమె పెన్షన్ డబ్బులు, కూలి పనుల నుంచి వచ్చిన డబ్బులు ఇంట్లోని బీరువాలో దాచుకునేది. రెండు రోజుల క్రితం బంధువుల ఊరు వెంకటాపురానికి వెళ్లింది. గురువారం సాయంత్రం ఆమె స్వగ్రామానికి వచ్చింది. ఇంట్లోని బీరువా పగలకొట్టి ఉండడాన్ని చూసి చోరీ జరిగినట్లు గుర్తించింది. బీరువాలో ఉన్న రూ.4 లక్షలు దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



తాడిపత్రి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు పరీక్ష రాసేందుకు ఏర్పాటు చేసిన బెంచీలు

తాడిపత్రి అర్బన్: ఇంటర్ పరీక్షల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానుండగా.. శనివారం ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు మార్చి 1న ప్రారంభమై 19 వరకు జరగనున్నాయి. సెకండ్ ఇయర్ పరీక్షలు మార్చి 2న ప్రాంభమై 20వ తేదీ వరకూ కొనసాగుతాయి. ఇప్పటికే అధికారులు పరీక్షలు రాసేందుకు విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులందరూ 8.30 నిమిషాలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 393 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 358 పరీక్షలు రాయనున్నారు. ఒక చీఫ్‌తో పాటు డిపార్ట్‌మెంటల్ అధికారి, 18 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. మోడల్ స్కూల్‌లో ఫస్ట్ ఇయర్ 397 మంది , సెకండ్ ఇయర్ 265 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఒక చీఫ్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారి, 12 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. టెక్ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ 362, సెకండ్ ఇయర్ 251 మంది విద్యార్థులు చీఫ్, డిపార్ట్‌మెంట్ అధికారితో పాటు 12 మంది ఇన్విజిలేటర్లు, సివిరామన్ జూనియర్ కళాశాలలో ఫస్ట్ ఇయర్ 471 మంది, సెకండ్ ఇయర్ 325 మంది విద్యార్థులు రాయనుండగా చీఫ్, డిపార్ట్‌మెంటల్ అధికారి, 21 ఇన్విజిలేటర్లను నియమించారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలను, ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు.

యాడికిలో..

యాడికి: మండలంలోని మోడల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఈ నెల 16 వరకూ ఇంటర్ పరీక్షలు జరుగుతాయని చీఫ్ సూపరింటెండెంట్ మోడల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మారుతి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోడల్ జూనియర్ కళాశాల కేంద్రంగా మొత్తం 290 మంది ప్రథమ, ద్వితీయ ఇంటర్ పరీక్షలు రాయనున్నారన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 158 మంది, ద్వితీయ సంవత్సరంలో 101మంది, సప్లిమెంటరీ పరీక్షలు 22 మంది, ఒకేషనల్ కోర్సులో కేజీబీవీ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థినులు ఇక్కడ పరీక్షలు రాస్తారన్నారు. ఐదు గదుల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాట్లు చేశామన్నారు. 16 సీసీ కెమెరాలతో లైవ్ స్ట్రీమింగ్ ఏర్పాట్లు చేపట్టామని, ఫర్నీచర్, తాగునీరు, అందుబాటులో వైద్య సిబ్బంది తదితర అన్ని సదుపాయాలు కల్పించామన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు.

ఘనంగా ఉరుసు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని పోర్టర్స్‌లైన్‌లో వెలసిన మహిమాన్వితుడు హజరత్ గులామ్ షా ఖాద్రీ బాబా ఉరుసు ఘనంగా నిర్వహించారు. గురువారం షంషీర్(దేవుడు) ఊరేగింపు చేపట్టారు. అనంతరం దర్గాలో మత గురువులు, పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

గడ్డివాముల దగ్ధం

వజ్రకరూరు: మండలంలోని ధర్మపురిలో గురువారం రెండు గడ్డి వాములు కాలిపోయాయి. గ్రామానికి చెందిన నేసే సూర్యనారాయణ, హరినాథరెడ్డి ఇతర రైతులకు చెందిన గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. ఉరవకొండ ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. గడ్డివాములు కాలిపోవడంతో ఒక్కొక్కరు రూ. 50 వేల చొప్పున నష్టపోయినట్లు బాధిత రైతులు వాపోయారు.

హోరాహోరీగా రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలో దూలం లాగుతున్న ఎద్దులు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న రాతిదూలం లాగుడు పోటీలు మూడో రోజూ కొనసాగాయి. న్యూ కేటగిరీ విభాగం పోటీల్లో 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. పోటీలను గురువారం జెడ్పీటీసీ రాధిక, సర్పంచ్ రుక్మిణమ్మ ప్రారంభించారు. శుక్రవారం సీనియర్ విభాగంలో పోటీలు ముగిసిన అనంతరం విజేతలకు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్ యాదవ్, పురుషోత్తం యాదవ్ తెలిపారు. ఎస్ఐ నబీరసూల్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

జగనన్నతోనే పేదల అభ్యున్నతి



కోటవీధిలో ప్రచారం చేస్తున్న కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి

యాడికి: 'అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించి పేదల అభ్యున్నతికి సీఎం జగనన్న కృషి చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి ఆయనను సీఎంగా చేసుకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగుతాయి' అని వైఎస్సార్‌సీపీ నాయకుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కోటవీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు వంద శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, శంకర్, రమణయాదవ్, శీన, నబీరసూల్, రవి, హనుమంతు, ఎరికలప్ప, సుబ్బారెడ్డి, హనుమంతరెడ్డి, కొండారెడ్డి, సచివాలయాల కన్వీనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



మున్సిపల్ అధికారులతో తాగునీటి సమస్యపై వాగ్వాదం చేస్తున్న కౌన్సిలర్లు

గుత్తి: తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్లో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. చైర్‌పర్సన్ వన్నూర్ బీతో కలసి కమిషనర్ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ బిందె వరలక్ష్మి, కౌన్సిలర్లు ఫరూక్, బుసా రూపావతి, వాల్మీకి శివ, ఖాజా ఖాన్,కేవీ రమణ, నరేష్, వరదరాజులు, అరవిందబాబు తదితరులు తాగునీటి సమస్యపై అధికారులను నిలదీశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో కౌన్సిలర్లు మూకుమ్మడిగా పోడియం వద్దకు దూసుకెళ్లి కమిషనర్, ఇతర మున్సిపల్ అధికారులతో తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగారు. తాగునీటి సమస్య పరిష్కారం చేయడానికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



సైన్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులందజేస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని టీసీ హైస్కూల్‌లో గురువారం సైన్స్ దినోత్సవ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం చేశారు. గత ఐదురోజులుగా ఆన్‌లైన్ విధానంలో చేపట్టిన పోటీల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను జ్ఞాపికలతో సత్కరించారు. ఆన్‌లైన్ ఐడియా కాంపిటీషన్ పోటీల్లో వరుసగా నాలుగు స్థానాల్లో ఆయేషా తప్సం, గాయత్రి, జ్యోతిర్మయి, నికిత నిలిచారు. అలాగే ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో షాహిద, మస్రత్, భీమక్క, గాయత్రి, జ్యోతిర్మయి, అయేషా, సౌజన్య, మధు, సంయుక్త ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన పోటీల్లో షాహీనా, శాఫియా సుల్తాన్, జీవనరూప విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెచ్‌ఎం కే రామకుమార్, రామాంజనేయులు యాదవ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'పల్స్‌పోలియో' విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శోభారాణి

బుక్కరాయసముద్రం: పల్స్ పోలియో విజయవంతం చేయాలని ఎంపీడీఓ శోభారాణి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై వైద్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 3, 4, 5 తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. మండలంలో 5 సంత్సరాల్లోపు పిల్లలు 4213 మంది ఉన్నారన్నారు. తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు లక్ష్మి స్వాతి, తెహరున్నీసా, సీహెచ్‌ఓ మోహన్‌రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, పీహెచ్‌ఎన్ చెన్నమ్మ, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.